క్లుప్తంగా

రైతులకు పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ


రైతులకు విత్తనాలు అందిస్తున్న మండల వ్యవసాయాధికారి భాస్కర్

చీమకుర్తి రూరల్: రైతులకు పచ్చిరొట్ట పంటల సాగుకు అవసరమైన విత్తనాలను మండల వ్యవసాయాధికారి డీవీ భాస్కర్ బుధవారం పంపిణీ చేశారు. మండలంలోని మంచికల పాడు, తొర్రగుడిపాడు సచివాలయాల పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విత్తనాలు పంపిణీ చేసి మాట్లాడారు. కౌలు రైతులు తప్పనిసరిగా కౌలు కార్డులు తీసుకోవాలన్నారు. అన్నదాత సుఖీభవకు సంబంధించి ఈకేవైసీని ప్రభుత్వం అప్‌డేట్ చేసిందని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికురాలికి నివాళులు


నివాళులర్పిస్తున్న కమిషనర్ రామకృష్ణయ్య, కాలం సుబ్బారావు

చీమకుర్తి: పట్టణంలో మున్సిపల్ కార్మికురాలిగా పనిచేస్తున్న మల్లవరపు యలమందమ్మ (55) బుధవారం అనారోగ్యంతో మరణించటంతో కమిషనర్ వై.రామకృష్ణయ్య, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు నివాళులర్పించారు. పారిశుధ్య కార్మికురాలిగా ఆమె అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు. వారి కుటుంబానికి అండగా ఉంటామన్నారు. మట్టి ఖర్చులకు రూ.5 వేలు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్లు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

ఎండోమెంట్ భూముల పరిశీలన


భూములను పరిశీలిస్తున్న తహసీల్దార్ నారాయణరెడ్డి బృందం

సంతనూతలపాడు: మండలంలోని పేర్నమిట్ట పరిధిలో 8, 565, 357, 542 సర్వే నంబర్లలోని ఎండోమెంట్ భూములను బుధవారం సంతనూతలపాడు తహసీల్దార్ ఎస్.ఎల్.నారాయణరెడ్డితో కూడిన రెవెన్యూ బృందం పరిశీలించింది. ఆయా సర్వే నంబర్లలోని ఎండోమెంట్ భూములను ఆన్‌లైన్ నిమిత్తం ఎండోమెంట్‌శాఖ పేర్నమిట్ట ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఏ ప్రసన్నలక్ష్మి గతంలో రెవెన్యూ కార్యాలయానికి దరఖాస్తు దాఖలు చేశారు. ఆ మేరకు తహసీల్దార్ నారాయణరెడ్డి చెన్నకేశవ, రామలింగేశ్వరస్వాములకు చెందిన ఎండోమెంట్ భూములను పరిశీలించారు. కార్యక్రమంలో సర్వేయర్ ఏ ప్రవీణ్, ఎండోమెంట్ పేర్నమిట్ట ఇన్‌స్పెక్టర్ ప్రసన్నలక్ష్మి, ఆయా ఆలయాల అర్చకులు పాల్గొన్నారు.

21న అండర్-16 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక

ఒంగోలు: అండర్-16 బాలుర క్రికెట్ జట్టును ఈ నెల 21వ తేదీ ఎంపిక చేయనున్నట్లు ప్రకాశం జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి కారుసాల నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మంగమూరు రోడ్డులోని అసోసియేషన్ సబ్ సెంటర్ నెట్స్‌లో ఉదయం 9 గంటలకు ఈ ఎంపిక జరుగుతుందన్నారు. ఎంపికైన జట్టు జూలై 3న మంగళగిరి/పేరేచర్లలో జరిగే ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అంతర జిల్లాల పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. ఎంపికకు హాజరయ్యేవారు తప్పనిసరిగా వైట్ డ్రస్, షూ, సొంత కిట్, జనన ధ్రువీకరణ పత్రం (ఫారం-5), ఆధార్‌కార్డు, స్కూల్ స్టడీ సర్టిఫికెట్‌తో హాజరుకావాలన్నారు. 2009 సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 2011 ఆగస్టు 31వ తేదీ మధ్య జన్మించిన వారు మాత్రమే అర్హులన్నారు. పూర్తి వివరాలకు కోచ్ కె.సుధాకర్ (9701022333), బి.చంద్రశేఖర్ (9246222999)ను సంప్రదించాలని నాగేశ్వరరావు సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

దర్శి (కురిచేడు): దర్శి మండలం రాజంపల్లి వద్ద ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తిని ఎదురుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనం, ఆ తర్వాత లారీ ఢీకొట్టడంతో కాలు విరిగింది. ఈ సంఘటన బుధవారం జరిగింది. వివరాలు.. దర్శికి చెందిన గర్నెపూడి జోంతన్ తన ద్విచక్ర వాహనంపై పొదిలి వెళ్తున్నాడు. రాజంపల్లి వద్దకు వెళ్లే సరికి ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. తేరుకునే లోపు లారీ కాలిపై నుంచి వెళ్లింది. జోంతన్ ఎడమకాలు పాదం నుజ్జునుజ్జయింది. 108కి సమాచారం అందించటంతో సిబ్బంది బాలజ్యోతి, ఖాదర్ బాషాలు సంఘటన స్థలానికి వచ్చి ప్రథమ చికిత్స చేసి క్షతగాత్రుడిని దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి వైద్యుల సూచన మేరకు ఒంగోలు తీసుకెళ్లారు.


నేలటూరు ఎస్సీకాలనీలో ఉన్న ఒకే ఒక సైడు కాలువ పూడిపోయి రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు


కాలనీ వద్ద రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త

మురుగు కంపు.. దోమల బెడద.!

- అధ్వానంగా నేలటూరు ఎస్సీకాలనీ
- పారిశుధ్య లోపం.. కాలనీకి శాపం
- పట్టించుకోని అధికార యంత్రాంగం

మద్దిపాడు: రాత్రి నిద్రపోవాలంటే దోమలు చంపుకుతింటున్నాయి. పోనీ.. పగలు నిద్రపోదామంటే మురుగు వాసనకు పేగులు మెలిపెడుతున్నాయి. మాకేమిటీ కర్మ అనుకుంటూ మద్దిపాడు మండలంలోని నేలటూరు ఎస్సీ కాలనీవాసులు అవస్థపడుతున్నారు. కాలనీ చుట్టూ చేరిన మురుగునీరు స్థానికులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. కాలనీలో ఒకటీరెండు కాలువలు మాత్రమే నిర్మించారు. వాటిలో కూడా పూడిక తీయించి ఏడాది దాటిపోవడంతో మురుగు పేరుకుపోయింది. ఇళ్లలోని వృథా నీటిని బయటకు పంపితే పక్కవాళ్లతో గొడవలు. ఏం చేయాలో తెలియని స్థితిలో కాలనీవాసులు కొట్టుమిట్టాడుతున్నారు. నిన్నమొన్నటి వరకూ పచ్చాకు పనులకు వెళ్లి అలసిపోయి తిరిగొచ్చిన కూలీలు రాత్రివేళ ఇంట్లో కాసేపు సుఖంగా నిద్రపోదామనుకుంటే దోమలతో జాతర సరిపోయింది. ప్రస్తుతం పనులు పూర్తయి పగలైనా అలసట తీర్చుకుందామంటే మురుగు కంపుతో వాంతి వస్తోంది. పాఠశాల వైపు ఉన్న కాలనీ రోడ్డు వెంట మురుగునీరు కిందకు వెళ్లకపోతుండటంతో ఎక్కడికక్కడ నిలిచిపోయి దోమలకు ఆవాసంగా మారింది.

వర్షాకాలం మొదలుతో మరిన్ని ఇబ్బందులు...

ప్రస్తుతం వర్షాకాలం మొదలవుతున్న నేపథ్యంలో దోమలు మరింత ప్రబలి జ్వరాల బారినపడే అవకాశాలు ఉన్నాయంటూ స్థానికులు ఆందోళన చెందుతున్నారు. గతంలో కాలనీ మొత్తం జ్వరాలతో మగ్గిపోయిన పరిస్థితులు ఉన్నాయని, అటువంటి పరిస్థితులు మరోసారి రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏదో ఉద్ధరిస్తుందని అనుకుంటే తమ సమస్యలు పట్టించుకున్న నాథుడే లేడని అంటున్నారు. కాలనీలో మురుగు కాలువలు నిర్మించాలని, లేకుంటే కచ్చా కాలువలైనా తవ్వించి మురుగునీరు బయటకు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. తద్వారా తమకు దోమలు, మురుగు కంపు నుంచి విముక్తి కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


కాలనీలో రెండోవైపు సైడు కాలువ లేక ఇళ్ల పక్కన నిల్వ ఉన్న మురుగునీరు



దోమల దెబ్బకు హడలిపోతున్నాం

మా కాలనీలో సైడు కాలువలు లేకపోవడంతో ఇళ్లలోని మురుగునీరంతా ఎక్కడికక్కడే నిల్వ ఉండి దోమలు పెరిగిపోతున్నాయి. పగలూ రాత్రీ తేడా లేకుండా దోమల దెబ్బకు హడలిపోతున్నాం. అధికారులు స్పందించి మా సమస్య పరిష్కరించాలి.

– కావూరి అంకయ్య, నేలటూరు ఎస్సీ కాలనీవాసి



కాలనీ చుట్టూ మురుగునీరే

మా కాలనీ చుట్టూ మురుగునీరు నిల్వ ఉండటంతో విపరీతమైన దుర్వాసన వస్తోంది. కాలనీలో కూడా రోడ్డు పక్కన మురుగునీరు పేరుకుపోతుండటంతో ఇరుగుపొరుగు వారితో గొడవలు అవుతున్నాయి. కాలువలు నిర్మించి మురుగు సమస్య పరిష్కారానికి పాలకులు, అధికారులు చర్యలు తీసుకోవాలి.

– వడేల నెహేమియా, నేలటూరు ఎస్సీకాలనీవాసి

దుంపా చెంచిరెడ్డి దంపతులకు సన్మానం


దుంపా చెంచిరెడ్డి దంపతులను సత్కరిస్తున్న కాలేషా, తదితరులు

సంతనూతలపాడు: వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ సెక్రటరీగా నూతనంగా నియమితులైన గొడుగు కాలేశా, అతని మిత్రబృందంతో కలిసి తన నియామకానికి సహకరించిన పార్టీ సంతనూతలపాడు మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ దంపతులను బుధవారం సత్కరించారు. సిండికేట్ రైతు సొసైటీ మాజీ అధ్యక్షుడు దుంపా యల్లమందారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన దర్శి ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, మాజీ మంత్రి మేరుగు నాగార్జున, ఇతర ముఖ్య నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. సంతనూతలపాడు మండలంలోని మైనంపాడు గ్రామానికి చెందిన గొడుగు కాలేశా నియామకంపై ఆ గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మాచవరపు వెంకట్రావు, పెరుగు సుబ్బారావు, షేక్ బస్ మస్తాన్, ఆకుల పూర్ణ, కే నాగేశ్వరరావు, కే మహేష్, పి.కొండలు, ఏ.సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

సింగరాయకొండలో రేపు జాబ్‌మేళా

ఒంగోలు వన్‌టౌన్: సింగరాయకొండలో ఈ నెల 20వ తేదీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జె.రవితేజయాదవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయం సంయుక్తంగా నిర్వహించే జాబ్‌మేళాలో బహుళ జాతీయ కంపెనీలు పాల్గొంటాయని చెప్పారు. సింగరాయకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉదయం 10 గంటల నుంచి జాబ్‌మేళా జరుగుతుందన్నారు. పేటీఎం, డెలివరీ డాట్‌కాం, ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్, టాటా ఎలక్ట్రానిక్స్, స్పైడర్ ఎలక్ట్రిక్స్, ఎస్‌బీఐ కార్డ్, కీర్తి మెడికల్స్ తదితర కంపెనీలు పాల్గొంటాయన్నారు. జిల్లాకు చెందిన 18 – 30 సంవత్సరాల వారు, 10వ తరగతి – పీజీ వరకూ విద్యనభ్యసించిన వారు అర్హులన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.12 వేల నుంచి రూ.25 వేల వరకూ వేతనం ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు అనూష (9652282636)ను సంప్రదించాలని సూచించారు.

సాంకేతిక పరిజ్ఞానంతో విద్య బోధించాలి


సంసిద్ధత మేళా కార్యక్రమం నిర్వహిస్తున్న సుబ్బారావు, తదితరులు

కొత్తపట్నం: అంగన్‌వాడీ పిల్లలకు చిన్న వయసు నుంచే సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్య బోధిస్తే జీవితంలో స్థిరపడతారని ఎఫ్ఎల్ఎన్ జిల్లా కో ఆర్డినేటర్ ఎం.సుబ్బారావు అన్నారు. మండలంలోని ఈతముక్కల ఎంపీపీఎస్ హెచ్‌డబ్ల్యూలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పిచ్చమ్మ ఆధ్వర్యంలో బుధవారం సంసిద్ధత మేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ రకాల స్టాల్‌లు ఏర్పాటు చేసి టీఎల్ఎం పొందుపరిచి 3 నుంచి 6 సంవత్సరాల వయసు గల పిల్లలు పాఠశాలకు ఎంతవరకు సంసిద్ధులుగా ఉన్నారో తెలుసుకున్నారు. అంగన్‌వాడీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతిలో చేర్చే కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో నూతనంగా వచ్చిన మార్పులు, అందిస్తున్న బోధన ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పిల్లల సమగ్రాభివృద్ధికి తల్లిదండ్రుల పాత్ర కూడా అవసరమన్నారు. ఇంటి వద్ద తమ వంతు తోడ్పాటునందించాలని కోరారు. అందరినీ ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని, అర్హులైన ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మ ఆలయ వార్షికోత్సవం

ఒంగోలు మెట్రో: స్థానిక 33వ డివిజన్ శివప్రసాద్‌కాలనీలోని పోలేరమ్మ ఆలయ 22వ వార్షిక మహోత్సవాన్ని బుధవారం కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం పోలేరమ్మ మూలవిరాట్‌కు అభిషేకం చేసి వివిధ రకాల పూలతో అలంకరించారు. అమ్మవారికి అర్చన, మంగళ హారతులతో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. స్థానిక మహిళా భక్తులు పోలేరమ్మకు పొంగళ్లు పెట్టి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం వందలాది మంది భక్తులకు అమ్మవారి అన్న ప్రసాదం అందజేశారు. సాయంత్రం పోలేరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి మేళతాళాలతో అలంకరించిన వాహనంపై నగరోత్సవం నిర్వహించారు. భక్తులు అమ్మవారికి ఎదురెళ్లి మంగళ హారతులిచ్చి పసుపు కుంకుమ సమర్పించుకున్నారు.

సాంస్కృతిక పోరాటాలను బలోపేతం చేయాలి


గాండ్ల వెంకటరావుకు జోహార్లు అర్పిస్తున్న నాయకులు

ఒంగోలు టౌన్: దేశంలో కార్పొరేట్ సంస్కృతి పెరిగిపోతున్న నేపథ్యంలో ప్రజా కళలను ప్రోత్సహించాలని, సాంస్కృతిక పోరాటాలను బలోపేతం చేయాలని సీపీఐ న్యూ డెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి చిట్టిపాటి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఎంఎస్ఎస్ భవన్‌లో ప్రజా కళాకారుడు గాండ్ల వెంకటరావు 12వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిట్టిపాటి మాట్లాడుతూ సమాజాన్ని సజీవంగా ఉంచేది ప్రజా కళలే అని స్పష్టం చేశారు. ప్రజలను చైతన్యవంతులను చేసేది, వారిలో సామాజిక ఆలోచనలను రేకెత్తించేది ప్రజా కళలేనని చెప్పారు. కళ కళ కోసం కాదు, కాసుల కోసం కాదు, ప్రజల కోసమని బలంగా నమ్మి చివరిదాకా ప్రజా చైతన్యం కోసం పాటుపడిన గాండ్ల వెంకటరావు జీవితం నుంచి స్ఫూర్తి పొందాలన్నారు. ఒంగోలు నగరంలో తాతా బిల్డింగులో వైద్యం చేసుకుంటూ అనేక ప్రజా ఉద్యమాలకు కేంద్ర బిందువుగా ఆయన కొనసాగారని తెలిపారు. తొలుత గాండ్ల వెంకటరావు చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో అరుణోదయ కళాకారుడు నాతాని హనుమంతరావు, పీఓడబ్ల్యూ రాష్ట్ర నాయకురాలు బి.పద్మ, రామ్మోహన్, హనుమంతరావు, రాజశేఖర్, అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ సేకరించే వారికి సామాజిక భద్రత కల్పించాలి


కమిషనర్‌కు వివరాలు అందిస్తున్న డీబీఆర్‌సీ ప్రతినిధులు

చీమకుర్తి: ప్లాస్టిక్, ఇతర వేస్ట్ వస్తువులు సేకరించే కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ప్రతినిధి దార్ల కోటేశ్వరరావు చీమకుర్తి మున్సిపల్ కమిషనర్ వై.రామకృష్ణయ్యను కోరారు. ఆ మేరకు బుధవారం చీమకుర్తిలో వినతిపత్రం అందించారు. చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరించే వారిని గుర్తించేందుకు ఈ నెలలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి వారి పేర్లు నమోదు చేసుకోనున్నట్లు ఈ సందర్భంగా కమిషనర్ తెలిపారు. నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకో సిస్టం (నమస్తే) కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ వ్యర్థాలు వేరుకునే పేదలకు ఈ అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు వారికి కూడా వర్తించే విధంగా గుర్తింపు కార్డులు పొందిన వారికి అవకాశం కల్పించనున్నట్లు వారు తెలిపారు. ఆధార్ కార్డులు సేకరించి బ్యాంక్ అకౌంట్లు ప్రారంభించి వారికి ప్రభుత్వ పథకాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ప్రతినిధులు కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి పాల్గొన్నారు.

21 నుంచి పాలిసెట్ విద్యార్థులకు కౌన్సెలింగ్

కొత్తపట్నం:

పాలిటెక్నిక్‌లో వివిధ రకాల కోర్సుల్లో ప్రవేశానికి పాలిసెట్ పరీక్ష రాసి ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఈ నెల 21 నుంచి 28వ తేదీ వరకు హెల్ప్‌లైన్ సెంటర్లలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు మండలంలోని ఈతముక్కల ఎస్‌యూవీఆర్, ఎస్ఆర్ ప్రభుత్వ మహిళా పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపాల్ వి.యేసుప్రసాద్‌రావు తెలిపారు. హాజరయ్యే ఓసీ, బీసీ విద్యార్థులు రూ.700, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.250 ప్రాసెసింగ్ ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించి రసీదును ప్రింట్ అవుట్ తీసుకోవాలన్నారు. ఆయా తేదీల్లో ర్యాంకుల వారీగా ఏర్పాటు చేసిన కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని సూచించారు. పూర్తి వివరాలకు దగ్గర్లోని హెల్ప్‌లైన్ సెంటర్లలో సంప్రదించాలని చెప్పారు.

తమ కళాశాలలో కంప్యూటర్స్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ అండ్ కమర్షియల్ ప్రాక్టీస్ డిప్లమా కోర్సుల్లో విద్యార్థినులకు ఉత్తమ అధ్యాపకులు, ఉత్తమ ల్యాబొరేటరీతో ఉత్తమ విద్య అందిస్తున్నట్లు తెలిపారు. హాస్టల్ వసతి, కళాశాలలో చదివిన విద్యార్థినులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వివరించారు.

అక్రమ అరెస్టులతో చెవిరెడ్డిని భయపెట్టలేరు

- వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ సమన్వయకర్త చుండూరి రవిబాబు



ఒంగోలు టౌన్: సంబంధంలేని విషయంలో అక్రమ కేసులు పెట్టి వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని భయపెట్టలేరని, కూటమి కుట్రలను ఛేదించి త్వరలోనే కడిగిన ముత్యంలా ఆయన బయటకు వస్తారని ఆ పార్టీ ఒంగోలు నియోజకవర్గ సమన్వయకర్త చుండూరి రవిబాబు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లిక్కర్ కేసుతో చెవిరెడ్డికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఉద్యమమే ఊపిరిగా బతికిన చెవిరెడ్డిని రెడ్ బుక్ రాజ్యాంగం కుట్రలలో భాగంగానే అరెస్టు చేశారన్నారు. రాష్ట్రంలో అంబేడ్కర్ రాజ్యాంగం అమలు చేయడంలేదని, రెడ్‌బుక్ రాజ్యాంగమే అమలవుతోందని అన్నారు. అర్ధరాత్రి అరెస్టులతో కూటమి ప్రభుత్వం అరాచకాలకు పాల్పడుతోందని విమర్శించారు. చెవిరెడ్డి అరెస్టును జిల్లాలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు తీవ్రంగా ఖండిస్తున్నారని, ఈ అక్రమ అరెస్టును సంఘటితంగా ఎదుర్కొంటామని అన్నారు. కరోనా మహమ్మారి ప్రబలినప్పుడు పార్టీలకతీతంగా ప్రజలను ఆదుకున్నందుకు ఆయనను అరెస్టు చేశారా.. పండుగలు వచ్చినప్పుడు ప్రతి ఇంటికీ ఒక పెద్దకొడుకులా బహుమతులు పంపించినందుకు అరెస్టు చేశారా.. కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి పల్లె ప్రగతి కోసం పాటుపడినందుకు అరెస్టు చేశారా..? అనేది కూటమి పాలకులు చెప్పాలని ప్రశ్నించారు. సిట్ అధికారులు ఎవరి కళ్లల్లో ఆనందం చూడాలని చెవిరెడ్డిని అరెస్టు చేశారో చెప్పాలని నిలదీశారు. కూటమి ప్రభుత్వం అక్రమ అరెస్టులు చేసి పైశాచిక ఆనందం పొందుతోందని, దీన్ని ప్రజలు చీత్కరించుకుంటున్నారని అన్నారు.

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలి

- కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: సాంకేతిక పరిజ్ఞానాన్ని, యంత్ర పరికరాలను వినియోగించడం ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవచ్చని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. రైతులకు రాయితీపై వ్యవసాయ పరికరాల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ప్రకాశం భవనంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయంలో వస్తున్న నూతన ధోరణులను రైతులు గమనిస్తూ సాంకేతిక పరిజ్ఞానాన్ని, యంత్ర పరికరాలను వినియోగించడం ద్వారా మెరుగైన దిగుబడి సాధించి సాగును లాభసాటిగా మార్చుకోవచ్చని చెప్పారు. ఈ క్రమంలోనే రాష్ట్ర ప్రభుత్వం వ్యక్తిగతంగా రైతులకు ఉపయోగపడేలా రాయితీపై యంత్ర పరికరాలను అందిస్తున్నట్లు తెలిపారు. 2024–25 సంవత్సరంలో జిల్లాలో 1257 మంది రైతులకు రూ.6.05 కోట్ల విలువైన యంత్ర పరికరాలను అందించినట్లు చెప్పారు. ఇందులో రూ.2.75 కోట్లను రాయితీగా ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అర్హులైన రైతులకు డ్రోన్లు, స్ప్రేయర్లు, సాదా, ఎదగొర్రులను, కలుపుతీత పరికరాలు పంపిణీ చేశారు. వీటిని వినియోగించడం ద్వారా తమకు కలిగే ప్రయోజనాలను రైతులు వివరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారులు, సాంకేతిక సిబ్బంది, పనిముట్ల పంపిణీ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత


మొక్కలు నాటి నీళ్లు పోస్తున్న మాజీ ఎమ్మెల్యే దారా సాంబయ్య, తదితరులు

నాగులుప్పలపాడు: యోగాతో మానసిక ప్రశాంతతతో పాటు శారీరక దారుఢ్యం కలుగుతుందని బీజేపీ మండలాధ్యక్షురాలు పాద అపర్ణ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా బుధవారం మండలంలోని వినోదరాయునిపాలెంలో యోగా దినోత్సవం, వృక్షారోహణ కార్యక్రమం నిర్వహించారు. తొలుత పాఠశాలలో ఉన్న టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సంతనూతలపాడు మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు దారా సాంబయ్య మాట్లాడుతూ జూన్ 21వ తేదీ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి అయిన టంగుటూరి ప్రకాశం పంతులు జన్మస్థలమైన వినోదరాయునిపాలెంలో నిర్వహించనుండటం అభినందనీయమని అన్నారు. విద్యార్థులు, యువత, గ్రామస్తులతో యోగా అభ్యాసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వివిధ రకాల మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సెగ్గం శ్రీనివాసరావు, నాయకులు పాద వరప్రసాదరావు, జిల్లెళ్లమూడి రమాదేవి, ఆశారావు, రాధాకృష్ణ, తాళ్లూరి రమేష్, బండారు రామాంజనేయులు, జనసేన ప్రధాన కార్యదర్శి తోట ఆంజనేయులు, నడిపినేని శేషగిరిరావు పాల్గొన్నారు.

ఒంగోలు మెట్రో: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పతంజలి యోగా మిత్ర మండలి ఆధ్వర్యంలో బుధవారం యోగాసనాలు, ప్రాణాయామం, సూర్య నమస్కారాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఒంగోలు రంగారాయుడు చెరువు వద్ద గాంధీ పార్కులో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో యోగా గురువు గోపాల్‌రెడ్డి పాల్గొని అవగాహన కల్పించారు. జూన్ 21వ తేదీ ప్రతి ఒక్కరూ యోగా కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. యోగాతో ఆరోగ్యం, మానసిక ప్రశాంతత కలుగుతాయని, దీర్ఘకాల వ్యాధులు సైతం తగ్గుముఖం పడతాయని తెలిపారు.

కూటమి విజయోత్సవాలలో కులహంకారం

- దళిత సర్పంచ్‌ని అవమానించిన ఎమ్మెల్యేపై కేసు నమోదు చేయాలని కేవీపీఎస్ డిమాండ్

ఒంగోలు టౌన్: కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న విజయోత్సవాలలో కులహంకారాన్ని ప్రోత్సహిస్తున్నారని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రఘురాం విమర్శించారు. ఆదోని మండలం డానాపురంలో దళిత సర్పంచ్‌ని అవమానించిన ఎమ్మెల్యే పార్థసారథి, టీడీపీ నాయకురాలు గుడిసె కృష్ణమ్మపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఆ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం ఏడాది సంబారాలలో భాగంగా డానాపురం గ్రామంలోని ఒక గుడి వద్ద సభ నిర్వహించారని తెలిపారు. సభ జరుగుతున్న సమయంలో గ్రామ సర్పంచ్‌ని వేదిక మీదకు రావాలని ఎమ్మెల్యే పిలిచారని, పక్కనే ఉన్న టీడీపీ నాయకురాలు కృష్ణమ్మ ఆ సర్పంచ్ ఎస్సీ కులానికి చెందిన వ్యక్తి అని చెప్పడంతో వేదిక మీదకు పిలవకుండా అవమానించారని తెలిపారు. దళిత సర్పంచ్ చంద్రశేఖర్ వేదిక దగ్గరకు వచ్చినప్పటికీ పైకి పిలవకపోవడం ముమ్మాటికీ కుల వివక్ష అవుతుందన్నారు. అంటరానితనాన్ని బహిరంగంగా పాటించిన ఎమ్మెల్యే పార్థసారథి, టీడీపీ నాయకురాలు కృష్ణమ్మ వ్యవహారశైలి సిగ్గుచేటన్నారు. ఏడాది పాలనలో కూటమి పాలకులు సాధించిందేమీ లేదని స్పష్టం చేశారు. కనీసం రాజ్యాంగ హక్కులను గౌరవించడం, సాటి మనిషిని మనిషిగా చూడటమైనా నేర్చుకోవాలని హితవు పలికారు. దళితుల ఓట్లు కావాలిగానీ దళితులు అక్కరలేదా అని ప్రశ్నించారు. ఒట్టిమాటలు కట్టిపెట్టి ఆదోని గ్రామీణ ప్రాంతాల్లో అంటరానితనాన్ని అంతమొందించేందుకు ఎమ్మెల్యే కృషి చేయాలని కోరారు.

భూసార పరీక్ష ఫలితాలను వినియోగించుకోవాలి

సంతనూతలపాడు: భూసార పరీక్ష ఫలితాలను రైతులు వినియోగించుకోవాలని మండల వ్యవసాయ అధికారిణి పి.పావని సూచించారు. మండలంలోని పేర్నమిట్ట-1, పేర్నమిట్ట-2 రైతు సేవా కేంద్రాల పరిధిలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. 2024-25 సంవత్సరానికి సంబంధించిన భూసార పరీక్ష ఫలితాల పత్రాలను గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా రైతులకు అందజేశారు. వ్యవసాయ విస్తరణ అధికారి కె.వి.సుబ్బారెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు జానకి, రైతులు పాల్గొన్నారు.